క్లుప్తంగా

రాజీ మార్గమే రాజమార్గం



కేసులను పరిశీలిస్తున్న జడ్జి భూపాల్‌రెడ్డి

ఆదోని రూరల్: రాజీమార్గమే రాజమార్గమని, జాతీయ లోక్‌అదాలత్ ద్వారా కేసులు సత్వరమే పరిష్కారమవుతాయని 7వ అదనపు జిల్లా జడ్జి భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఆదోని జిల్లా కోర్టు ప్రాంగణంలో పలు కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో దాదాపు 78 కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, జూనియర్ సివిల్ జడ్జి జి.అర్చనతో పాటు జాతీయ లోక్‌అదాలత్ సభ్యులు, న్యాయవాదులు సి.ఆనంద్, బి.రామంజి, మహ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సన్మానం



మల్లికార్జున దంపతుల్ని సన్మానిస్తున్న అధ్యాపకులు

కౌతాళం: కౌతాళం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున పదవీ విరమణను పురస్కరించుకుని శనివారం ఆయనను అధ్యాపకులు, స్నేహితులు ఘనంగా సన్మానించారు. మల్లికార్జున దంపతులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆదోని గరల్స్ కళాశాల ప్రిన్సిపాల్ సంజన్న, ఎమ్మిగనూరు గరల్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి మల్లికార్జున సేవలను గుర్తు చేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



కౌతాళంలో పూజలందుకుంటున్న ఆంజనేయ స్వామి

కౌతాళం: ఆంజనేయస్వామి ఆలయాలలో శనివారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసల దిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేశారు.

8నుంచి కాకినాడలో ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: జూలై 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కాకినాడలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మీర్, అబ్దుల్‌ఖాదర్, రయాన్, నరసింహులు, రవి, శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ ఏర్పాటు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శనివారం ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. ఈ అసోసియేషన్‌కు నూతన అధ్యక్షుడిగా పంచముఖి ట్రేడర్స్ యజమాని మహేంద్రబాబు, గౌరవాధ్యక్షుడిగా మహేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా దయాసాగర్, వీరారెడ్డి, కార్యదర్శులుగా నాగరాజు, శేషిరెడ్డి, నరసింహుడు, కోశాధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. వీరిని కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి

స్థానిక సంస్థల్లో రెండేళ్లు అధికారంలో ఉండేది మనమే

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ అండగా ఉంటుంది
- మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, చిత్రంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక



హాజరైన కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఎమ్మిగనూరుటౌన్: ' మున్సిపల్ కౌన్సిల్‌తో పాటు గ్రామ సర్పంచులు, ఎంపీపీలు ఇలా స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా మరో రెండేళ్ల పాటు అధికారంలో ఉండేది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారే. ఏ ఒక్కరూ టీడీపీ నాయకుల బెదిరింపులకు భయపడొద్దు. అన్ని విధాలుగా మీకు అండగా ఉంటాం..ధైర్యంగా ఉండి ప్రజా సమస్యలపై గళమెత్తా' లని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక సూచించారు. శనివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్ పార్టీ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, వైఎస్ఆర్‌సీపీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో వారు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు ఐక్యతతో పట్టణాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి తప్పుడు హామీలతో అధికారం చేజిక్కించుకున్నాయన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయక పోతే ప్రజలే ఆ పార్టీలకు గుణపాఠం చెబుతారన్నారు. ఎవరు కూడా టీడీపీ ప్రలోభాలకు తలొగ్గి పార్టీ మారే ఆలోచనలు చేయవద్దని, రెండేళ్లు కష్టపడితే మళ్లీ స్థానిక ఎన్నికల్లో గెలవవచ్చునని చెప్పారు. పట్టణంలో టీడీపీ నాయకులు అక్రమ సంపాదనకోసం భూఆక్రమణలు చేసే అవకాశం ఉందని అటువంటి వాటిపై దృష్టి సారించి ప్రజలకు మేలు చేకూర్చే పనులు చేపట్టాలని పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే సూచించారు. మళ్లీ రాష్ట్రంలో వైఎస్ఆర్ సీపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ అవలంభించే ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు పోరాడాలన్నారు. సమావేశంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రుద్రగౌడ్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, పార్టీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్ ప్రసంగించగా రాష్ట్ర శాప్‌నెట్ వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు బుట్టాశివనీలకంఠ, బుట్టాప్రతుల్, రియాజ్ అహమ్మద్, మండల పార్టీ కన్వీనర్ బీఆర్‌బసిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 51 కేసుల పరిష్కారం



లోక్‌అదాలత్‌లో కేసులను విచారిస్తున్న జడ్జి జి.వందన

ఎమ్మిగనూరు టౌన్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో జడ్జి జి.వందన 51 కేసులను విచారించి పరిష్కరించారు.ఇందులో 36 రాజీ కేసులు కాగా, ఒకటి భరణం కేసు, 5 చెక్ బౌన్స్ కేసులు, సివిల్ దావాలు 6, సారా కేసులు 3 పరిష్కారమైనట్లు బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ గోపాలకృష్ణ, సాల్మాన్, లోక్ అదాలత్ సభ్యుడు వీరాస్వామి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురు రాజారావు, న్యాయవాదులు కోర్టు,లోక్ అదాలత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని టౌన్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ బోయ శాంత అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఇందుకు ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయనకు చైర్మన్, వైఎస్ చైర్మన్‌లు గౌస్, నరసింహులు, పాలకవర్గసభ్యులు ఆహ్వానం పలికారు. అనంతరం సభ్యులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

వాడీవేడిగా చర్చ...

పట్టణంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ పాలకవర్గ సభ్యులు వై.జి.బాలాజీ, నాగరత్నమ్మ అధికారులను నిలదీశారు. ప్రతినెలా జరిగే కౌన్సిల్‌లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకుండా పోతుందని దుయ్యబట్టారు. వార్డుల్లో ప్రజలకు సమాధానం చెప్పుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులే నిర్లక్ష్యం వహిస్తే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. తాగునీటి సమస్య వేధిస్తున్నా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్లు బాలాజీ, సందీప్‌రెడ్డి, నాగరత్నమ్మ, పార్వతమ్మ, సురేష్ మండిపడ్డారు. మున్సిపాలిటీ లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వాకీటాకీలు ఎక్కడ ఉన్నాయో చెప్పాలని కౌన్సిలర్ బాలాజీ ప్రశ్నించారు. అందుకు అధికారుల నుంచి సమాధానం లేకపోయింది. 25 నెలలు గడుస్తున్నా వాకీటాకీలు ఎక్కడున్నాయో కౌన్సిల్‌లో చూపకపోవడం శోచనీయమన్నారు. జనరల్ ఫండ్స్ కింద రూ.2 కోట్లు ఉన్నాయని, అభివృద్ధి పనులు చేసేందుకు ఆమోదం తెలపాలని అజెండాలో పొందుపరిచారు. ఎక్స్ అఫిసియో సభ్యుడిగా ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్యే సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ..రాజకీయాలు, కులమతాలకు అతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



మున్సిపల్ అటెండర్ దంపతులను సన్మానిస్తున్న కమిషనర్, చైర్మన్, వైస్ చైర్మన్

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగులకు తమ విధినిర్వహణలో అందించే సేవలతోనే గుర్తింపు లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో అటెండర్లుగా పనిచేస్తున్న శంకరన్న, షరీఫ్‌లు శనివారం పదవీ విరమణ చేశారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, సునీల్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ వెంకటేష్‌లతో పాటు మున్సిపల్ సిబ్బంది వారికి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అలాగే స్థానిక వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో పదవీవిరమణ చెందిన ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును ఉపాధ్యాయులు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో డీఈఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, విక్టర్, ఆర్‌ఓ బేబి, మేనేజర్ వరప్రసాద్, ఏఈలు మదన్, శరత్‌చంద్ర, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

ఆలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సూర్యశేఖర్ రెడ్డి శనివారం ప్రకటనలో వెల్లడించారు. జూలై 24వ తేదిలోగా www.iti.af.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 25వ తేదీ దరఖాస్తు చేసుకున్న ఫారంతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. జూలై 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అడ్మిషన్ కోసం కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పదోతరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు ప్రయాణ కష్టాలు



సుకువాయి మార్గంలో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

హొళగుంద: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళాశాలకు వస్తున్న సుళువాయి, సమ్మతగేరి, పెద్దహ్యాట, హాలహర్వీ మండలం విరుపాపురం తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులకు ప్రయాణ తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రానికి రావాలంటే ప్రతి రోజు 13 కి.మీ ఆటోలో వచ్చి వెళ్తున్నారు. ఆలూరు–సుళువాయి, కోగిలతోట మార్గంలో అదనపు బస్సులు లేకపోవడం, విద్యార్థుల పాఠశాల సమయానికి బస్సులు నడవకపోవడం తదితర కారణాలతో తల్లిదండ్రులు విద్యార్థులను రోజూ ఆటోలోనే పంపుతున్నారు. ఒకే ఆటోలో 30 మందికిపైగా విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. అధికారులు ఈ మార్గంలో విద్యార్థి బస్సుతో పాటు అదనపు బస్సులు తిప్పాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

వసతి గృహాల్లో విద్యార్థులకు సీటు కల్పించాలి



బీసీ వెల్ఫేర్ డీడీకి వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం కర్నూలులో బీసీ వెల్ఫేర్ డీడీ వెంకటలక్ష్మిని కలసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతమైన ఆదోని డివిజన్‌లో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎక్కువగా ఉన్నారన్నారు. సరిగా వర్షాలు లేక పోవడంతో తల్లిదండ్రులు బతుకు తెరువు నిమిత్తం వలసలకు వెళ్తుంటారన్నారు. దీంతో వసతి గృహంలో సీటు రాక చాలా మంది విద్యార్థులు మధ్యలోనే చదువును ఆపేస్తున్నారన్నారు. అధికారులు పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలని కోరారు. అలాగే హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు.

అతిసారంపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సూపర్ వైజర్ పరమేశప్ప

గోనెగండ్ల: వర్షాకాలంలో అతిసారం ప్రబలే ప్రమాదం ఉందని..అప్రమత్తంగా ఉండాలని సూపర్ వైజర్ పరమేశప్ప సూచించారు. శనివారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు డయేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి జ్వరాలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేడి చేసిన నీటినే తాగాలన్నారు. ఎవరికైనా ఆరోగ్యం బాగా లేకపోతే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ హనుమంతు, ఏఎన్ఎం ప్రమీలా, కేజీబీవీ ప్రిన్సిపాల్ విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



మంచాలమ్మను దర్శించుకుంటున్న న్యాయమూర్తి అశోక్

మంత్రాలయం : శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై హైకోర్టు న్యాయమూర్తి అశోక్(కాలబర్గి బెంచ్) మంత్రాలయం విచ్చేశారు. శనివారం ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సమేత హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మద్యం రవాణాదారుల అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని హానవాల్ గ్రామానికి చెందిన గొల్ల మల్లికార్జున, గొల్ల మంజునాథ శనివారం అక్రమంగా మోటార్ సైకిల్‌పై కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డారని పెద్దతుంబళం చిన్నపీరయ్య తెలిపారు. మద్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేయగా హీరో మోటార్ సైకిల్, 90 ఎం.ఎల్. పరిమాణం గల 192 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

చంద్రబాబుపై పోరాటానికి సిద్ధం కండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాలమహానాడు నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఎస్సీ వర్గీకరణ చేస్తామని మళ్లీ చిచ్చు రేపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై మరో పోరాటానికి సిద్ధం కావాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి నర్సప్ప, రాయలసీమ అధ్యక్షుడు గద్దం నాగేంద్ర, మండల, పట్టణ నాయకులు నరసింహులు, రంగన్న, రంగస్వామి పేర్కొన్నారు.శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. వర్గీకరణ అంశం సుప్రీంకోర్టులో ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ చేస్తామని పేర్కొని మాలల ద్వేషిగా మారాడని ఆరోపించారు. టీడీపీ గెలుపునకు మాలలు కృషి చేస్తే నేడు ద్రోహం చేసేందుకు ప్రయత్నించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భాష్యంలో ఘనంగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఎమ్మిగనూరు: పట్టణంలోని భాష్యం ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ మాచాని కవిత మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంచుతాయన్నారు. అలాగే ప్రతి విద్యార్థి విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల చాంప్స్ ఇన్‌చార్జ్ అనురాధ, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు ఉద్యోగ కల్పన

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహబుబ్‌బాష పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ కాలేజీలో బీఏ, బీకాం, డిజిటల్ మార్కెటింగ్, కంప్యూటర్ కోర్సులు, బీఎస్సీ మాథ్స్, సైన్స్ కోర్సులున్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

సేవలందించడమే బుట్టాఫౌండేషన్ ధ్యేయం

ఎమ్మిగనూరుటౌన్: బుట్టా ఫౌండేషన్ ద్వారా సేవలు అందిచడమే ధ్యేయంగా తాము పనిచేస్తున్నామని ఆ సంస్థ నిర్వాహకులు, వైఎస్ఆర్‌సీపీ యువ నాయకుడు బుట్టాప్రతుల్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మైనారిటీ కాలనీలో గల కేజీబీవీ పాఠశాలలో బుట్టాఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు నోట్ బుక్‌లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల అభ్యున్నతికి మాజీ ఎంపీ బుట్టారేణుక కృషి చేస్తున్నారన్నారు. ప్రతిభ గల విద్యార్థులకు అవసరమైన సహాయసహకారాలు అందిస్తున్నట్లు చెపారు. ఇక నుంచి ఎమ్మిగనూరులో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవాకార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజర్ చరిత, కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపాల్ కవిత, వైఎస్ఆర్ స్టూడెంట్ యూనియన్ నాయకుడు షరీఫ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీబీ డ్యామ్‌కు జలకళ

- పెరుగుతున్న ఇన్‌ఫ్లో
- ఎగువన ఉన్న గాజనూరు జలాశయం గేట్లు ఎత్తివేత
- శివమొగ్గ జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు
- టీబీ డ్యామ్‌లో 6 టీఎంసీల నీరు

హొళగుంద: కర్ణాటకలోని హొస్పేట్ వద్దనున్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. శివమొగ్గ జిల్లాలో కొద్ది రోజులుగా ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో టీబీ డ్యాం ఎగువన ఉన్న గాజనూరు జలాశయం (అప్పర్ తుంగ ప్రాజెక్ట్)లో నీటి నిల్వ గరిష్ఠ మట్టానికి చేరింది. దీంతో శనివారం అక్కడి ఇంజనీర్లు కొన్ని గేట్లను ఎత్తి సుమారు 10 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఆ నీరు దిగువన ఉన్న తుంగభద్ర డ్యాం వైపుకు వస్తున్నాయి. శనివారం రాత్రి లేదా ఆదివారం ఉదయానికి డ్యాంకు పూర్తిస్థాయిలో నీరు చేరే అవకాశాలున్నట్లు బోర్డు అధికార వర్గాలు తెలిపాయి. ఎగువున ఉన్న చిక్‌మంగళూరు, కొప్పి, శివమొగ్గ, శృంగేరి, వరనాడు, మలేనాడు, తీర్థనహళ్లీ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు అక్కడి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. తుంగ డ్యాం నుంచి నీటిని విడుదల చేయడంతో కర్ణాటక, ఆంధ్రా రాష్ట్రాలకు సంబంధించి దిగువ కాలువ (ఎల్లెల్సీ) ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతేడాది ఈ సమయానికి కేవలం 3 టీఎంసీలు ఉండగా నేడు 6 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంది. కొద్ది రోజులుగా డ్యాంకు నీటి ప్రవాహం మొదలు కాకపోడంతో దిగాలు చెందిన రైతులు తుంగా నుంచి నీరు విడుదలవుతుండడంతో వరుణుడు కరుణించి రిజర్వాయర్ త్వరగా నిండాలని ఆశగా ఎదురు చూస్తున్నారు.

టీబీ డ్యాంలో నీటి నిల్వ

తుంగభద్ర రిజర్వాయర్ పూర్తిమట్టం 1633 అడుగులకు గాను 1581.56 అడుగులు ఉంది. నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్‌కు ఇన్‌ఫ్లో 1,819 క్యూసెక్కులుండగా అవుట్‌ఫ్లో 297 క్యూసెక్కులుంది. గతేడాది ఇదే సమయానికి 1577.80 అడుగులతో 3.493 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండేది.